



**ఆర్టిజన్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 05 ఏప్రిల్ , 2026 | పేజీలు : 06


# యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించండి

## శాంతి ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలి

ఎఐపిఎస్ఒ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్

ఈనెల 7న నల్లగొండలో యుద్ధానికి వ్యతిరేక ర్యాలీకి పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ** : అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ, ప్రజల్లో శాంతి చైతన్యం పెంపొందించేందుకు జరుగుతున్న శాంతి ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎఐపిఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్ పిలుపునిచ్చారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంస్థ (ఎఐపిఎస్ఓ)నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం పట్టణంలోని పిఆర్‌టియూ భవనంలో జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కెవిఎల్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ వాతావరణం మానవాళికి తీవ్ర ముప్పుగా మారుతోందన్నారు. యుద్ధాల వల్ల సాధారణ ప్రజలే అత్యధికంగా నష్టపోతున్నారని, దేశాల మధ్య శాంతి, సహకారం అత్యవసరమని పేర్కొన్నారు.అమెరికా ఇజ్రాయెల్ వలసాధిపత్య ధోరణి ప్రపంచ శాంతికి ప్రమాదంగా మారిందని ఆయన అన్నారు. ఈ రెండు దేశాల దుందుడుకు విధానాలు ప్రపంచాన్ని కల్లోలంలోకి నెట్టుతున్నాయని, ఇది కేవలం సంఘర్షణ మాత్రమే కాదని, ఒక మారణహోమంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ఇరాక్ (2003),తరువాత వెనిజులా, ప్రస్తుతం ఇరాన్‌పై అమెరికా ఆధిపత్య వైఖరితో దాడులు కొనసాగుతున్నాయని విమర్శించారు.వనరుల కోసం ప్రారంభమైన ఈయుద్ధాలు ఇప్పుడు నూతన వలసవాద భావజాలంతో నడిచే జాత్యహంకార దాడులుగా మారాయని,వారి లక్ష్యం ఆధిపత్యం తప్ప మరొకటి కాదని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ యుద్ధాల ప్రభావంతో పెట్రోల్,గ్యాస్ మాత్రమే కాకుండా అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సాధారణ ప్రజల రోజువారీ జీవితం దుర్భరంగా మారుతోందన్నారు.ఇప్పటికే ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాల ప్రభావంతో దెబ్బతిన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరో ఆర్థిక మాంద్యం ముంగిట్లో ఉందని తెలిపారు.సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ, యుద్ధానికి వ్యతిరేకంగా ఈనెల 7న నల్లగొండలో నిర్వహించనున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు అనంతుల శంకరయ్య,కట్ట వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, గుర్రం వెంకట్ రెడ్డి,పసల శౌరయ్య,కోమటి రెడ్డి ప్రద్యుమ్నరెడ్డి, ముండ్ల ముత్యాలు,షరీఫుద్దీన్,పాణెం వెంకట్రావు, ఉప్పునూతల యాదగిరి,కర్నాటి వెంకటేష్, చలం పాండురంగారావు,గుండా లింగారెడ్డి,నిమ్మల భీమర్జున్ రెడ్డి, పి.బ్రహ్మాచారి, దశరథ పాల్గొన్నారు.

## ఇంటి వద్దే ఎఫ్ఐఆర్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : బాధితుల సౌలభ్యం కోసం తెలంగాణ పోలీస్ ఇంటి వద్ద ఎఫ్ఐఆర్ నమోదు విధానాన్ని అమలు చేస్తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, బలహీన పరిస్థితుల్లో ఉన్న బాధితులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని శనివారం ఒక ప్రకటనలో వివరించారు. లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత, పోక్సో, ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటి, బాల్య వివాహ నిరోధక చట్టాల వంటి సంబంధిత నేరాల్లో బాధితులు పోలీసు స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే పోలీసు వారు వారి నివాసం లేదా తమకు అనుకూలమైన ప్రదేశమునకు వెళ్ళి ఫిర్యాదు స్వీకరిస్తారన్నారు. ఫిర్యాదుదారు ఫిర్యాదు రాయలేని పరిస్థితుల్లో పోలీసు వారే బాధితుని వాంగ్మూలం వారి భాషలోనే నమోదు చేసి చదివి వినిపించి వారి సంతకం తీసుకుంటారని పేర్కొన్నారు. అక్కడి నుండే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అక్కడే ఫిర్యాదుదారునికి ఎఫ్ఐఆర్ ప్రతిని అందజేస్తారని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లల కేసుల్లో మహిళా పోలీసు అధికారిని ఉంటుందన్నారు. అవసరమైతే ఇంటర్‌ప్రెటర్ లేదా ప్రత్యేక ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం తీసుకుంటారని, పోలీసులు సంఘటన స్థలాన్ని రక్షించి, సాక్ష్యాలను సేకరించే చర్యలు వెంటనే చేపడతారని చెప్పారు. ఈ విధానం వల్ల ఫిర్యాదు నమోదు ఆలస్యం తగ్గడంతోపాటు బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లే భారం తగ్గుతుందన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కోరారు.

## మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటర్ల మ్యాపింగ్, బూత్‌స్థాయి అధికారుల శిక్షణ, బూత్‌స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించడం జరుగుతుందని, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్ స్థాయి ఏజెంట్ల నియామకంపై సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ, సూర్యాపేట, హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారులు సూర్యనారాయణ, వేణుమాధవ్, శ్రీనివాసులు, ఎన్నికల విభాగం సూపరిండెంట్ సంతోష్ కిరణ్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికే ఇంటింటికి సిపిఐ

ప్రజా పోరాటాల పార్టీ సిపిఐను ఆదరించి చేయూతనివ్వండి

జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి** : నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐ పార్టీని ఆదరించి చేయూతనివ్వాలని, భవిష్యత్తులో ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేయడానికి సిపిఐ పార్టీకి అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక సహకారం అందించి ప్రజా ఉద్యమాల నిర్మాణానికి తోడ్పాటు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం భువనగిరి పట్టణంలో ఇంటింటా సీపీఐ కార్యక్రమాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటా సీపీఐ కార్యక్రమాన్ని సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ప్రారంభించామని తెలిపారు. ప్రధానంగా ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి చేపడుతున్నామన్నారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సాధక బాధకాలను స్వయంగా అడిగి తెలుసుకుంటారని ముఖ్యంగా పేదల ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్ లు, నిరుద్యోగుల, విద్యార్థుల, మహిళల తదితర స్థానిక సమస్యలపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఈ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులను సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యంగా 6 గ్యారెంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో ఆలస్యం జరుగుచున్నదని తెలిపారు. దీంతో ప్రజలు హామీల అమలుపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. స్థానిక సమస్యలపై త్వరలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించ బోతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, నాయకులు బద్దం వెంకట్ రెడ్డి, చింటూ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటి స్థలాన్ని గ్రామ పంచాయతీకి రాసిచ్చిన త్రిపుర గవర్నర్

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తన సొంత ఊరి కోసం తన ఇంటి స్థలం సుమారు 20 గుంటలను గ్రామ పంచాయితీకి రాసిచ్చారు త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి. మండలంలోని గానుగుబండ గ్రామ పంచాయితీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పక్కా భవనం లేక గత కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్ మాతంగి వెంకటమ్మ కరుణాకర్‌లు గానుగుబండ గ్రామ పెద్దలతో కలిసి పలుమార్లు ఆయనకు విన్నవించారు. ఈ విషయమై ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో గ్రామ పంచాయితీకి తన ఇంటిని వ్రాసి ఇచ్చారు. ఈ విషయంపై గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయన దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఫర్నీచర్ ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** గజ్వేల్ నియోజక వర్గ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అక్రమంగా చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్ పెద్దల ఆలోచన ప్రకారమే ఇలాంటి ఆరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో సమయం కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్ పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్‌జిఎం గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి 8వ రగ్బీ క్రీడలను ప్రారంభించి వారు మాట్లాడారు. యువత ఉత్సాహంతో క్రీడల్లో రాణించడంతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్‌అలీ, కౌన్సిలర్లు కొనతం రాజేష్ రెడ్డి, కొండపల్లి దిలీప్‌రెడ్డి, గునగంటి హేమ సతీష్, కోతి గోపాల్‌రెడ్డి, జానయ్య, ఆలేటి మాణిక్యం, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాట్య మండలి సభలను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రజానాట్య మండలి నల్లగొండ జిల్లా 8వ మహాసభలను విజయవంతం చేయాలని మండలి జిల్లా కమిటి సభ్యులు జిట్ట స్వామి కోరారు. మహాసభలకు సంభందించిన కరపత్రాలను శనివారం చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 6, 7 తేదీలలో నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు మేడి స్వామి, సభ్యులు మేడి సునిత, మేడి రాణి, గోపమ్మ, భద్రమ్మ, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ : జిల్లా ఎస్‌పి కె నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బాధితుల సౌలభ్యం కోసం తెలంగాణ పోలీస్ ఇంటి వద్ద ఎఫ్ఐఆర్ నమోదు విధానాన్ని అమలు చేస్తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, బలహీన పరిస్థితుల్లో ఉన్న బాధితులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని శనివారం ఒక ప్రకటనలో వివరించారు. లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత, పోక్సో, ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటి, బాల్య వివాహ నిరోధక చట్టాల వంటి సంబంధిత నేరాల్లో బాధితులు పోలీసు స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే పోలీసు వారు వారి నివాసం లేదా తమకు అనుకూలమైన ప్రదేశమునకు వెళ్ళి ఫిర్యాదు స్వీకరిస్తారన్నారు. ఫిర్యాదుదారు ఫిర్యాదు రాయలేని పరిస్థితుల్లో పోలీసు వారే బాధితుని వాంగ్మూలం వారి భాషలోనే నమోదు చేసి చదివి వినిపించి వారి సంతకం తీసుకుంటారని పేర్కొన్నారు. అక్కడి నుండే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అక్కడే ఫిర్యాదుదారునికి ఎఫ్ఐఆర్ ప్రతిని అందజేస్తారని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లల కేసుల్లో మహిళా పోలీసు అధికారిని ఉంటుందన్నారు. అవసరమైతే ఇంటర్‌ప్రెటర్ లేదా ప్రత్యేక ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం తీసుకుంటారని, పోలీసులు సంఘటన స్థలాన్ని రక్షించి, సాక్ష్యాలను సేకరించే చర్యలు వెంటనే చేపడతారని చెప్పారు. ఈ విధానం వల్ల ఫిర్యాదు నమోదు ఆలస్యం తగ్గడంతోపాటు బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లే భారం తగ్గుతుందన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని కోరారు.

# ఏపీ ధాన్యం రాకుండా సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని రైస్ మిల్లుల వద్దకు ఏపీ నుంచి ధాన్యం లోడ్‌లు రాకుండా పోలీసులు సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మిర్యాలగూడలోని పలు రైస్ మిల్లులను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోని మాట్లాడారు. యాసంగి ధాన్యం ప్రారంభమైన మొదటి రోజుల్లో క్వింటాకు రూ.2750 రేటు ఇచ్చిన మిల్లర్లు సిండికేట్‌గా మారి మూడు రోజుల నుంచి కేవలం రూ.2400 ఇస్తున్నారని ఆరోపించారు. కేఎన్ఎం, మహేంద్ర చింటు రకాలను కొందరు మిల్లర్లు మాత్రమే కొనుగోలు చేస్తూ కేవలం రూ.2100 చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. గత ఏడాది యాసంగి బోనస్‌ను ఇంతవరకు రైతులకు ఇవ్వలేదని వెంటనే చెల్లించాలని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదయ్యయాదవ్, సర్పంచ్‌లు ప్రసాద్, సాగర్‌నాయక్, నాయకులు శ్రీనివాస్, రైతులు, మధుసూదన్, నాగేశ్వర్‌రావు, వెంకన్న, నందకిశోర్, నిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇంద్రపాలనగరంలో ప్రగతి ప్రణాళిక కార్యక్రమం




**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య సేవలు ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది ఎన్‌సిడినాన్ కమ్యూనికేబుల్ డిసీజిస్ అంటే ఒక వ్యక్తి నుంచి మరొకరికి సంక్రమించని ధీర్ఘకాలిక వ్యాధులు ఉదాహరణ క్యాన్సర్, డయాబెటీస్, గుండె జబ్బులు, స్ట్రోక్ ఇవి అంటువ్యాధులు కావు. మారుతున్న జీవనశైలి వలన వస్తాయని విద్య, వైద్యం గురించి అవగాహనా కల్పించి వీటి బారిన పడకుండా మిల్లెట్స్ జొన్నలు, రాగులు, కొర్రలు, తిని రోగాల బారిన పడకుండా ఆరోగ్యం కాపాడుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, ఈర్లపల్లి మల్లయ్య, కొండం రాంరెడ్డి, బోనగిరి మహేష్, రాధారపు మల్లేశం, మేకల నరేష్, మంటి నరేష్, సింగణబోయిన మల్లేశం, ఆశవర్కర్‌లు, గ్రామపంచాయతి సిబ్బంది ఎండీ అమినొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ సర్వేయర్ డిఐగా చలామణి అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలో ఒక ప్రైవేటు వ్యక్తి డిఐగా డిప్యూటీ ఇన్స్పెక్టర్‌గా చలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. భూ సర్వే పనుల పేరుతో అధికార హోదా ఉందని చెప్పుకుంటూ రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం మునుగోడుమండలం కొంపల్లి గ్రామానికి చెందిన చేపూరి వెంకట నరసింహా సర్వేయర్ లైసెన్స్ నెంబర్ 257 కలిగిన వ్యక్తి తనను తాను రెవిన్యూ శాఖకు చెందిన డిఐగా పరిచయం చేసుకుంటూ భూ సరిహద్దులు కొలవడం పత్రాలు పరిశీలన వంటి పనులు చేస్తున్నట్టు నటిస్తున్నాడు. ఈ క్రమంలో అమాయక రైతులను నమ్మ బలికి భారీ మొత్తాలు దోసుకుంటున్నాడని బాధితులు చెప్తున్నారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలాంటి మోసాలకు అడ్డు కట్ట వేయాలని అధికారులను కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దర్యాప్తు చేసి నకిలీ డిఐ అధికారిగా చలామణి అవుతున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/రామన్నపేట :** రాష్ట్ర ప్రభుత్వవిప్‌గా నియామకమైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ని వారి నివాసంలో భోగారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోగారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మద్దెపురి ఐలయ్య, మాజీ సర్పంచ్ గంపల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.






## వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని పలువురు వీధి వ్యాపారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ చిట్యాల వారు గొడుగులను శనివారం పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీతారమేష్‌లు పాల్గొని మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు చేపడుతున్న సామాజిక సేవలు సామాన్య ప్రజలకు ఎంతో మేలు కలిగిస్తాయన్నారు. వేసవి ఎండకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వీధి వ్యాపారులకు గొడుగులను అందజేయడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా జిఎంటి కో ఆర్డినేటర్ గుడిపూడి వెంకటేశ్వరరావు సహకారంతో కొనసాగిన ఈ కార్యక్రమంలో స్థానిక క్లబ్ ప్రధాన కార్యదర్శి రేగుల గడ్డ నర్సింహ్మా, కోశాధికారి కొల్లోజు శ్రీకాంత్, సభ్యులు, కౌన్సిలర్లు కోనేటి ఎల్లయ్య, ఏర్పుల పరమేష్ పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని చైనత్యనగర్‌లో గల సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే, వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్ధులకు విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడం మా పాఠశాల ప్రత్యేకత అని అన్నారు. అనంతరం కరస్పాండెంట్ అలుగుబెల్లి శిరీషతో కలిసి విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెమెంటోలను అందచేశారు. వార్షిక దినోత్సవంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రవిశంకర్ రెడ్డి, బి.మల్లిఖార్జున్, సుమన్, పరమేశ్వరి, పద్మ, లావణ్య, సుజాత, శృతి, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి నూతన కమిటీ



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలోని నెలకొని ఉన్న పురాతన ఆలయం శ్రీశ్రీశ్రీ ఉమా మహేశ్వర దేవాలయం కోసం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. దేవాలయ అభివృద్ధి, నిర్వహణ, భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ కమిటి ఉపయోగపడుతుందని కమిటి సభ్యులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నారాయణ మధుసూదన్, నీలకంఠం నరేష్, ఉపాధ్యక్షులుగా చింతకింది తిరుమలయ్య, కోశాధికారిగా నారాయణ రమేష్, సభ్యులుగా ఏర్పు లక్ష్మమ్మ, పొట్లపల్లి వెంకటేశం, గుజ్జరి యాదగిరి, కుర్రు సత్తయ్య, ఏదుల లక్ష్మి, మోర రాములు, గుండెబోయిన నర్సింహ్మా, ఏర్పుల శ్రీలత, చింతకింది లింగయ్య, సత్తయ్య, మారయ్య, ఈదయ్య, యాదయ్య, అంజయ్య, నర్సింహ్మా, బుచ్చమ్మ, లక్ష్మమ్మలు ఏకాభిప్రాయంతో ఎన్నికయ్యారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ పట్టణానికి చెందిన దయ్యాల బాల రాజు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు వారి కుటుంబ సభ్యులు దయ్యాల స్వరూప ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు వీరి హార్దిక పరిస్థితులను గమనించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని సమాచారం తెలుసుకుని ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి వారిని పరామర్శించి 10000. పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

# తండ్రికి తగ్గ తనయుడిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మాజీ మంత్రి, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి రాజకీయ వారసత్వాన్ని ఆయన తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పునికిపుచ్చుకొని తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్నాడని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ప్రజల అండతో తుంగుతర్తి, సూర్యాపేట నియోజక వర్గాల్లోని ప్రతి గ్రామంలోని కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇవ్వడంతో పాటు ప్రజలతో నేరుగా మమేకమవుతూ క్యాడర్‌ను బలోపేతం చేయడంలో ముందున్నారని అన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొందడంతోపాటు, పేట ప్రజలను ఐక్యం చేసి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకునేలా కృషి చేశారని కొనియాడారు. ఈనెల 5న (నేడు) ఆయన జన్మదినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు సిద్ధమైనట్లు వివరించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన షేక్ చాంద పాషాకు రూ.17వేలు, చివ్వెంల మండలం పిల్లలజగ్గు తండకు చెందిన గుగులోతు బుజ్జికి రూ.58వేల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

## ప్రేమసేవల పరమార్థమే సత్యసాయి మార్గం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** సత్యసాయిబాబా బోధించిన బోధనలను అనుసరించి, ప్రతి వ్యక్తి మోక్షాన్ని సాధించవచ్చని సత్యసాయిబాబా మిర్యాలగూడ సాయిసేవా సమితి కన్వీనర్ ఆదినారాయణ అన్నారు. శనివారం సాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా వంద గ్రామాల్లో వంద భజనలు చేయాలని సంకల్పించుకున్నామని అందులో భాగంగా మండలంలోని గానుగబండ రామలయం వద్ద 45వ భజన కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ భజన బృందం వారు సత్యసాయి కీర్తనలు, ఆలాపన చేశారు. ఈ భజన కార్యక్రమంలో సాయి భక్తులు రఘు, రేవతి, వేణుబాబు, మాజీ ఎంపిటిసి పోకల వెంకమ్మ, గుర్రం జయమ్మ, ఈశ్వరమ్మ, కట్ట రూప్సీ, షేక్ హిమాంబీ, పంగా శ్రావణి, సత్యావతి, అనిత పాల్గొన్నారు.



# మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మౌలిక సదుపాయాలు కల్పించి డబుల్ బెడ్ రూం ఇండ్లను అందుబాటులోకి తేవాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మారి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని కేసారం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను జిల్లా హౌసింగ్ అధికారులతో కలిసి వారు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. గత ప్రభుత్వం ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే లబ్ధిదారులను ఎంపిక చేశారని దీంతో వాటిలో నివాసం ఉండే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకూడదనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులతో త్రాగునీటి వసతి, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం లాంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు యండి అంజద్అలీ, కోతి గోపాల్‌రెడ్డి, కక్కిరేణి శ్రీనివాస్, కొండపల్లి దిలీప్ రెడ్డి, గునగంటి హేమ సతీష్, కొనతం రాజేష్ రెడ్డి, రేఖ రమణ సతీష్ పాల్గొన్నారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గంచే శనివారం కోర్టు ఆవరణలో ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు, సహాయ అధికారి మాధవరపు రామకృష్ణలు ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి షేక్ జానిపాషా, లైబ్రరీ సెక్రటరీగా గాలి శ్రీనివాసనాయుడు, కోశాధికారి కోడూరి వెంకటేశ్వరరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి వెంకటచలం, మహిళ ప్రతినిధి వి.ధనలక్ష్మి, ఈసి సభ్యులు షేక్ రంజాన్‌బాషా, టి.సీతారామరాజు, బి.దుర్గ, హేమలత, షేక్ నాగుల్‌పాషా, పి.హనుమంతరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్ పెద్దబ్బాయ్ లను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సిలివేరు వెంకటేశ్వర్లు పలువురు న్యాయవాదులు శాలువాలతో, బొకేలతో అభినందించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. నూతన కోర్టు భవనం త్వరితగతిన పూర్తయ్యే విధంగా కృషి చేయడంతో పాటు న్యాయవాదుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

# గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ విద్య చేరువ కావాలి



**ప్రజాపక్షం/కోదాడ:** నగరాలకు ధీటుగా విద్యా ప్రమాణాలతో కోదాడలో హైదరాబాద్ ప్రైడ్ పబ్లిక్ గర్ల్స్ స్కూల్, కాలేజ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు అన్నారు. శనివారం పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన పాఠశాల ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌వి విద్యా సంస్థల చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలకు పైగా నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చారని అన్నారు. వారి బాటలోనే ముత్తినేని పృధ్వీ రమణరావు సామాజిక దృక్పదంతో ఈ విద్యాసంస్థను స్థాపించి గ్రామీణ విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చారని కొనియాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కళాశాల చైర్మన్ ముత్తినేని పృధ్వీ రమణరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరం మల్లేశ్వరి, కౌన్సిలర్లు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకట నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముక్కంటి ఆజ్ఞతో ప్రవేశ ద్వార నిర్మాణానికి స్థల పరిశీలన

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మేళ్లచెరువులో వెంచేసి యున్న శ్రీఇష్ట కామేశ్వరి సమేత స్వయంభు శ్రీ శంభు లింగేశ్వరస్వామి దేవాలయానికి ఆర్చి నిర్మాణం చేయుటకు దేవాలయ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, దేవాలయ అర్చకులు శనివారం మేళ్లచెరువులోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద స్థలాన్ని పరిశీలన చేశారు. రాష్ట్ర ప్రభుత్వంనుండి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దేవాలయ అభివృద్ధికి మహాశివరాత్రి సందర్భంగా కోటి రూపాయల నిధులు మంజూరిచేయుచగా ఆ నిధుల నుండి 23 లక్షల రూపాయల వ్యయంతో ఆర్చి నిర్మాణం చేసేందుకు కేటాయించారు. ఈ ఆర్చి నిర్మాణం దేవాదాయశాఖ అధికారి శ్రీనివాసశర్మ, ఎఈ కిరణ్ కుమార్‌లు నిర్మాణ స్థలాన్ని పరిశీలించి అనుకూల స్థలంలో ప్లాన్ ఎస్టిమేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరితగతిన ఈ స్థలంలో ప్లాన్ ఎస్టిమేషన్ వేసి టెండర్‌కు పిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి చైర్మన్ పెండ్లి లచ్చయ్య, ఈవో నాగెల్ల శంభిరెడ్డి, అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, మండల పార్టీ అధ్యక్షులు కాకునూరి భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సింగారం సైదులు, హరిలక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.



# ఉరేసుకుని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఉరేసుకుని ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గల్లా దుర్గమ్మకు ఇద్దరు కుమార్తెలు, చిన్న కుమార్తె వేదామృత (17) ఇంటర్ మొదటి సంవత్సరం నేరేడుచర్ల పట్టణంలోని ప్రభుత్వకళాశాలలో చదువుతుంది. సెలవులకు ఇం టికి వచ్చి ఇంటి వద్దనే ఉంటుంది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటిలో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఊరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## సమష్టిగా రామన్నపేట నియోజకవర్గం సాధించుకుందాం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల , పరిసర ప్రాంత ప్రజలు అధికారులు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు అందరూ ఏకమై, రామన్నపేట నియోజకవర్గం సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని దానికోసం జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, దేశస్థాయి, అధికారులను కలవడంతో పాటు, అనేక హోదాలలోఉన్న రాజకీయ నాయకులను, ప్రజాప్రతినిధులను, రాష్ట్ర, కేంద్ర మంత్రులను కలిసి రామన్నపేటకు ఉన్న భౌగోళిక పరిస్థితులను, రామన్నపేట ఉన్న గత చరిత్రను వివరిస్తూ రామన్నపేట నియోజకవర్గం సాధనతోపాటు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని రాజకీయాలకతీతంగా కలిసి ముందుకుసాగాలని మాజీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ తెలంగాణ వెటర్నరీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముక్కామల దుర్గయ్య యాదవ్ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మోటకొండూర్ పిహెచ్‌సి వైద్యాధికారి విజయ్, మోటకొండూర్ సర్పంచ్ భూమండ్ల జేయమ్మ శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం మోటకొండూరు పిహెచ్‌సిలో ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరానికి వచ్చిన వారికి బి.పి షుగర్ టిబి వంటి వ్యాధుల పై పూర్తి స్థాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి 80 మందికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వంగాల నిఖిల, రవార్డు సభ్యులు జూకంటి మధు, వైద్య సిబ్బంది నరసింహా, శ్రీనివాస్, సుభాషిని, యాకయ్య, జ్యోతి నరేష్, ఉమేష్, ఆశా కార్యకర్తలు జ్యోతి, మహాలక్ష్మి ఐలమ్మ కవిత పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధన చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. జిల్లా కలెక్టర్‌గా హన్విక, డిఈవోగా కౌమలి, ఎంఇవోగా లౌక్యశ్రీ, ప్రధానోపాధ్యాయురాలుగా జీషన్, పిఈటిలుగా బలరాం, రాకేష్ లు తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు, వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, అనసూర్య, విజయ పాల్గొన్నారు.





## బీర్ల అయిలయ్య చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/మోటకొండూర్** : ఆలేరు నియోజకవర్గం లోని తేర్యాల బిక్కేరు వాగులో గోదావరి నది జలాలు ఎండాకాలంలో పారుతుండడంతో ఇదంతా బీర్ల అయిలయ్య చలువేనని బీర్ల అయిలయ్య చిత్రపటానికి తేర్యాల సర్పంచ్ మంత్రి లతా స్వామి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లతా స్వామి మాట్లాడుతూ సంకల్పం గట్టిగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అనే నానుడి బీర్ల ఐలయ్య నిరూపించారని తెలిపారు. ఈ ప్రాంత రైతులు బీర్ల అయిలయ్యకు రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాజ మోహన్, మాజీ వార్డు సభ్యులు ఉల్లెంగల బాలయ్య, చిన్నం రాములు పాల్గొన్నారు.

## జహంగీర్ కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తెలంగాణ ఉద్యమ కారుడు, గాయకుడు, ఎం.డి జహంగీర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుడు జహంగీర్ తెలంగాణ ఉద్యమంలో చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రభుత్వం జహంగీర్ కుమారుడికి తెలంగాణ సాహితీ అకాడమీలో ఉద్యోగం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తుర్కపల్లి మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మి నారాయణ, సీనియర్ నాయకులు యట పెంటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు పాల్గొన్నారు.

## చలివేంద్ర ఏర్పాటు అభినందనీయం



**ప్రజాపక్షం/చింతపల్లి** : వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ధైర్యపురి తాండా గ్రామ సర్పంచ్ వాంకుడోతు అనితాదాసునాయక్ అన్నారు. మండల పరిధిలోని ధైర్యపురి తాండా గ్రామంలో తేరటిపల్లి గురునాదం, వాంకుడోతు రాము సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం అనితాదాసు ప్రారంభించారు. ఎండాకాలంలో దాహంతో ప్రయాణించే ప్రయాణీకుల దాహాన్ని తీర్చుటకు ముందుకు వచ్చిన దాతలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చందర్‌నాయక్, వార్డు సభ్యులు మహమద్ షాహెదామహమూద్, కళ్యాణ్‌నాయక్, గోపి, శంకర్‌నాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

## మొండి బకాయిలను వసూలు చేయడమే నా తప్పా?



**ప్రజాపక్షం/వేములపల్లి** : మహిళా స్వయం సహాయక సంఘాల మొండి బకాయిలను వసూలు చేసి సంఘాల మెరుగుపరిచే క్రమంలో కొంతమంది కావాలనే తనపై బురద చల్లుతున్నారని లక్ష్మీదేవి గూడెం వివోఏ ముత్యాల సరిత అన్నారు.శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలోని మహిళా సంఘం మెరుగుపరిచే క్రమంలో కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవడం కొంత మంది వ్యక్తులకు అసంతృప్తిగా ఉన్నదని అందుకే తనపై తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ఆమె అన్నారు.19 మొండి బకాయిలు ఉన్న తమ గ్రామంలోని స్వయం సహాయక సంఘాలను 80 శాతం వరకు రికవరీ చేసి అటు ప్రభుత్వ అధికారులకు బ్యాంకు అధికారులకు అనుసంధానంగా పనిచేస్తున్న తనపై తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.తన పైన ఎలాంటి నిజమైన ఆరోపణలు ఉంటే స్వచ్ఛందంగా తప్పుకుంటానని అన్నారు.

## గ్రామంలో మంచినీటి సమస్యను తీర్చండి....

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని గ్రామాలలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామాలలోని ప్రజలు తాగు నీరు లేక అల్లాలాడుతున్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి గ్రామాలలో మిషన్ భగీరథ ద్వార ఇంటింటికి పైప్‌లైన్లు వేసిన గ్రామాలలో మాత్రం నీటి కొరత ఏర్పడుతునే ఉంది. ముఖ్యంగా చిత్రియాల గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్‌కు నీళ్లు వచ్చినప్పటికి ప్రజలకు మాత్రం నీరు అందడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో రెండు ట్యాంక్‌లు ఉన్నప్పటికి వచ్చిన నీళ్లు మాత్రం ఎటుపోతున్నాయే కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. గ్రామంలో కొంత మంది నీరు వదిలిన వెంటనే భగీరథ పైపులకు మోటార్లు వేసి పెడుతుండడంతో మోటార్లు వేసిన వారికి మత్రమే నీరు వస్తుందని మిగితా వారికి



నీరు రావడంలేదని అధికారులకు తెలిపినా నేటికి పట్టించుకునే నాదుడే లేదని వాపోతు న్నారు. గ్రామంలో నీటి కొరతతో ప్రజలు ఇబ్బందిపడుతుంటే ఎన్నిసార్లు మిషన్ భగీరథ అధికారులకు ఫోన్ చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. ముందే వేసవి కాలం వచ్చిన తరుణంలో ఇప్పటికైనా అధికారులు స్పందిం చి చిత్రియాల గ్రామంలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## కంచే చేను మేసినట్టుంది



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని ఆమనగల్లు గ్రామంలో ప్రజా ప్రతినిధుల పనితీరు కంచే చేను మేసినట్లు ఉంది గ్రామంలో ఏదైనా ఆపద వస్తే ఆదుకునే ప్రజాప్రతినిధి అమానుషంగా మూగజీవాలను చంపుతుంటే చూస్తూ ప్రోత్సహించడం బాధాకరమని గ్రామస్తులు వాపోతున్నారు.గత నెలలో 200 మూగజీవాలను విష ప్రయోగం చేసి మట్టుపెట్టిన సంగతి ఊరి జనాలను ఆశ్చర్యానికి గురి చేసింది,గ్రామంలో తిరిగే వీధి కుక్కలు నోరులేని మూగజీవాలకు ఎలాంటి గ్రామపంచాయతీ తీర్మానాలు లేకుండా విషమిచ్చి చంపేయడం పట్ల చలించిన కొంతమంది గ్రామస్తులను అధికార దర్పంతో నోరు మూయించేస్తున్నారు విషయాన్ని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. గ్రామంలో జరిగిన తీరు మూగజీవాలనే కాదు గ్రామస్తులను కూడా భయాందోళనకు గురిచేస్తుంది. ఇదేంటి అని ప్రశ్నించిన గ్రామస్తులను ఎలాంటి విచారణ లేకుండా ఇది ఇలాగే ఉంటది.కావాలంటే పై అధికారులకు కంప్లైంట్ చేసుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి వెళ్ళిపోయారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని ఇలాంటి దుర్మార్గాలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు.

## కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

**ప్రజాపక్షం/నకిరేకల్** : గజ్వేల్‌లో తెలంగాణ రాష్ట్ర కార్యసాధకుడు,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం పిరికిపంద చర్య అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పిందని,కాంగ్రెస్ గూండాల అరాచకాలకు అడ్డుకట్ట లేకుండా పోయిందని విమర్శించారు.శనివారం నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు కేసీఆర్ సొంత నియోజకవర్గంలోని క్యాంపు కార్యాలయంపైనే దాడులు జరగడం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు నిదర్శనమన్నారు.గత రెండేళ్లుగా కాంగ్రెస్ నాయకులు వివిధ రకాలుగా అరాచకాలు సృష్టిస్తూ గందరగోళం చేస్తున్నారని ఆరోపించారు.పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ ఇలాంటి సంఘటనలకు వత్తాసు పలకడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు.

## కనకదుర్గ దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయ కమిటి నూతన పాలకవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేశారు.ఆలయ ఛైర్మన్‌గా ఎన్నికైన కందాల సత్తిరెడ్డి,ధర్మకర్తలుగా ఏశబోయిన వెంకటేశం,గోలి పద్మ,గండమల్ల నాగలక్ష్మి,కర్నాటి మంగమ్మలు అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఛైర్మన్, ధర్మకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు.కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవ రెడ్డి,నాయకులు పన్నాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.





## ఘనంగా 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** గుడ్‌ఫ్రైడే సందర్భంగా మండల కేంద్రంలోని వివిధ చర్చిల ఫాస్టర్లు, క్రైస్తవ సోదరులు శనివారం ఘనంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. చర్చిల నుండి చౌరస్తా వరకు పాస్టర్లు, క్రైస్తవ సోదరు, సోదరీమణులు భారీ ర్యాలీ నిర్వహించారు. దైవ దీనులు పాస్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం ఏసు ప్రభువు ఈ లోకంలో జన్మించారని, అందరిని సమానంగా చూడాలని, ప్రేమ, కరుణ భావాలతో మెలగాలని, సేవతో ఉండాలని చెప్పిన కరుణామయుడని అన్నారు. ఈకార్యక్రమంలో పాస్టర్లు దేవకుమార్, షాలేమ్ రాజు, జకారియా, అనిల్‌కుమార్, ఏలిషా, ఇమాన్యుయేల్, సామ్యూల్, అందుగుల ప్రవీణ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అనసూయమ్మ జీవితం అందరికి ఆదర్శం




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ సాయుధపోరాట యోధురాలు ఈ ప్రాంత సిపిఎం ఉద్యమ కెరటం మేదరమెట్ల అనసూయమ్మ జీవితం అందరికి ఆదర్శమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో అనసూయమ్మ సంతాప సభలోపాల్గొని మాట్లాడారు. అనసూయమ్మ పోరాటాలను, త్యాగాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని కోరారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, మల్లు నాగార్జునరెడ్డి, యాదగిరిరావు, పారేపల్లి శేఖర్, రాములు, పోటు లక్ష్మయ్య పాల్గొన్నారు.

## పౌష్టికాహారాన్ని సద్వినియోగం



**ప్రజాపక్షం/మునగాల:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణీలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వేమూరి సత్యనారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి నూతన కమిటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటచారి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్త ఉమా, ఎఎన్‌ఎం రమణ, ఆశా కార్యకర్త అంగన్‌వాడీ ఆయాలు, బాలింతలు, గర్భిణీలు మహిళలు పాల్గొన్నారు.

## ఆర్‌పిఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సమాన విద్య, న్యాయం సాధ్యం కావాలంటే తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన సిఫారసులను వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని ఉమ్మడి సమన్వయకర్త ఎర్ర శివ రాజు,రాష్ట్ర కోకన్వీనర్ పొదిల శ్రీనివాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలో జరిగిన బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.జిల్లా కన్వీనర్‌గా మాధగోని యాదయ్య,జిల్లా కార్యదర్శిగా జిల్లా శాంసన్,జిల్లా కోకన్వీనర్లుగా మెరుగు పెద్దయ్య,కందుల మోహన్,విజయలక్ష్మి,జటవత్ రవి,గోపనబోయిన కృష్ణ,ఇర్గి నారాయణ,చింత స్వప్న,సహాయ కార్యదర్శిగా పొతేం కర్ణాకర్,కోశాధికారిగా కొండ పూర్ణిమ, సలహాదారులుగా పగడాల నాగయ్య,కొండల్ రెడ్డి,కె.జానయ్యలను ఎన్నుకున్నారు.



## రవీంద్రకుమార్ హౌస్ అరెస్టు

**ప్రజాపక్షం/దేవరకొండ;** సిఐడి కార్యాలయం ముట్టడి సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ శనివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐడి విచారణ పేరుతో వేదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలే రని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయిందని అన్నారు. అభివృద్ధిని మరిచి అరె స్టుల పేరుతో ప్రభుత్వం పబ్బం గడుపుతుంది అని ప్రజ లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## రూ. 50వేలు, పట్టుచీర



**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మండలం పర్శ తండాకు చెందిన నేనావత్ సోని అనే యువతి వివాహా నికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కిషన్‌నాయక్ పెద్ద న్నలా మారి అండగా నిలిచారు. తల్లిదండ్రులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సోని పరిస్థితిని తెలుసుకున్న ఆయన ఆమె వివాహానికి తన వంతు సహాయంగా రూ. 50వేల నగదుతో పాటు నూతన వధువుకు పట్టుచీరను కానుకగా అందజేశారు. ఈకార్యక్రమంలో రమావత్ రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓరియంటేషన్ శిక్షణ

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల ఓరియంటే షన్ ప్రొగ్రాం శిక్షణ కార్యక్రమంను నిర్వహించను న్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్సూర్‌నా యక్ తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఐదురోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఈ శిక్షణకు హాజరయ్యే వార్డు సభ్యులు వారి వెంట ఆధార్‌కార్డు, పాస్‌ఫోర్టు సైజ్ ఫోటో తీసుకుని హాజరుకావాలని కోరారు. ఓరియంటే షన్‌లో వార్డు సభ్యులు శ్రద్ధగా విని గ్రామాభివృద్ధికి పా టుపడాలన్నారు. ఈ శిక్షణకు ప్రతి ఒక్కరు హాజరై వారు ఇచ్చే క్లాసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/మర్రిగూడ** :మండలంలో నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించడంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో కీలకంగా మారిందని మండల కాంగ్రెస్ అధ్య క్షుడు రాందాస్ శ్రీను తెలిపారు.ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 30.13 లక్షల విలువైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు



## బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అన్నారు.శనివారం కళాశాలలో ఆయన జయంతిని ఎన్ఎస్ఎస్,సోషల్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సి పాల్,అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు.వక్తలు మాట్లాడుతూ భారత రాజకీయాల్లో ఆయన కీలక నాయకుడని, హరిత విప్లవం ద్వారా దేశ ఆహార భద్రతకు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.మునిస్వామి, రాజనీతి శాస్త్ర విభాగం అధ్యక్షులు డాక్టర్ ఆదె మల్లేశం,ఎన్. కోటయ్య,డాక్టర్ అనిల్ బొజ్జ,దినేష్,సావిత్రి,టి.శ్రీనివాస్,వివిధ విభాగాల అధిపతులు,అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/రామన్నపేట** : ఇటీవల ప్రభుత్వ విప్‌గా నియమితులైన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను రామన్నపేట కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయన నివాసంలో కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వేముల వీరేశంకు ప్రభుత్వ విప్గా నియామకం కావడం గర్వ కారణమని, ఆయన నాయకత్వంలో ప్రజలకు మరింత సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రామన్నపేట నియోజకవర్గం గురించి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మేజర్ గ్రామపంచా యతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ, నీర్నేముల సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి, జిల్లా నాయకులు జినుకల ప్రభాకర్, ఉపసర్పంచ్ మోటె రమేష్, సాల్వేరు అశోక్, ఎండి అక్రమ్, ఎండి జమీరుద్దీన్, కొమ్ము రామస్వామి, అబ్దుల్ వహీద్, కోట సుధాకర్, అన్వర్, గొలుసుల ప్రసాద్, ఊట్కూరి శ్రీను, గొరిగే శేఖర్, గంగాపురం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్వర్తి గ్రామంలో చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధి లోని వెల్వర్తి గ్రామంలో చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని శనివారం శివాజీ యూత్ గౌరవాధ్యక్షుడు బొడ్డు వెంకటరమ ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువత చత్రపతి శివాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. మహారాష్ట్రలో సాధారణ కుటుంబంలో పుట్టిన శివాజీ స్వశక్తితో ఒక రాజ్యాన్ని స్థాపించి, దేశంలోనే బహుజ నుల చీకటి బతుకులలో దారి దివిటి అయ్యాడని, స్వరాజంలో రైతులు, స్త్రీలు, గిరిజనలు, సబ్బండ వర్గాలను భాగస్వామ్యం చేసి బహుజన నిర్మాణం ఎలా ఉండాలో శివాజీ పాలన నేటి పాలకులకు ఆద ర్శమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చముడాల అనిత నర్సింగ్ యాదవ్, చత్ర పతి శివాజీ అధ్యక్షులు శ్యామల కొండల్ రెడ్డి, చత్ర పతి శివాజీ యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు, యువ కులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ఎమ్మెల్యే కార్యాలయంపై జరిగిన దాడి హేయమైన చర్య



**ప్రజాపక్షం/యాదాద్రి** : గజ్వేల్ ఎమ్మెల్యే కార్యాలయంపై జరి గిన దాడిని హేహమైన చర్యగా భావిస్తున్నాం అని బిఆర్ఎస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై కూడా కాంగ్రెస్ పాలనలో భద్రత కరువైంది. కాంగ్రెస్ కార్యకర్తలు హద్దుమీరి రౌడీయిజంకు పాల్పడు తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపన్యా సాలు కాంగ్రెస్ కార్యకర్తలకు ఊతమిస్తు న్నాయి. బిఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెలను కూలగొడతామని బహిరంగ సభల్లో ఉపన్యా సాలు, నిండు శాసనసభలో మా కాంగ్రెస్ పార్టీలో కండలు తిరిగిన ఎమ్మెల్యేలు ఉన్నారని, ప్రభుత్వానికి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడిన గుడ్లు పీకేస్తానని, లాగులు తొండలు విడుస్తా నని మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు హద్దు మీరి రౌడీయిజం చేస్తున్నారు.

## ఆర్మీ లెఫ్టినెంట్‌గా చిలుముల సుధాకర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫసర్‌గా విధులు నిర్వహిస్తున్న చిలుముల సుధాకర్,జాతీయ కేడెట్ దళం(ఎన్ సీసీ)లో అసోసియేట్ ఎన్‌సీసీ అధి కారిగా సేవలందించేందుకు అర్హత సాధించి,లెఫ్టినెంట్ హోదాతో ఆర్మీ అధికారిగా గుర్తింపు పొందారు.ఈసందర్భంగా మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగ పూర్‌లో ఉన్న ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో జనవరి5 నుంచి ఏప్రిల్ 4 వరకు మూడు నెలలపాటు జరిగిన కఠి నమైన సైనిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు.శిక్షణలో భాగంగా తుపాకీ కాల్పులు,ఆయుధాల వినియోగం, ఫీల్డ్ క్రాఫ్ట్,పరేడ్,శారీరక దృఢత్వ శిక్షణ, నాయకత్వ లక్షణాల అభివృద్ధి వంటి అంశాలలో సమగ్ర ంగా శిక్షణ పొందారు.శిక్షణ అనంతరం లెఫ్టినెంట్ హోదాతో ఆర్మీ అధికారిగా నియామకం పొందిన సుధా కర్ కళాశాలకు గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భం గా కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు,సిబ్బంది, విద్యా ర్థులు శ్రీ చిలుముల సుధాకర్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తూ,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## మెగా హెల్త్ క్యాంపు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా ఉండాల మండలం సుద్దాల గ్రామంలో శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణా ళిక 99 కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించడం జరి గింది. ఈ సందర్భంగా గ్రామస్థులకు రక్త పరీక్షలు, బీపి, షుగర్ పరీక్షలు ఉచితంగా మందులను అందజేయడం జరిగింది. ఈసంద ర్భంగా డా. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిభిరంలో పాల్గొని పరీ క్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పం చ్ మహోదయ్, ఉప సర్పంచ్ కాసం నగేష్, వార్డు సభ్యులు, పంచా యతీ సెక్రటరీ, మధు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పోషణ దినోత్సవం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణీలు, విద్యార్థులు సద్వినియో గం చేసుకోవాలని సర్పంచ్ కటికం వేణు అన్నారు. శనివారం మం డల కేంద్రంలోని పొనుగోడు గ్రామంలో ఆరోగ్య పోషణ దినోత్స వాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి రోజు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపించాలని, ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవల న్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కటికం ఉమా, ఆయా భారతమ్మ, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## వైభవంగా కల్చరల్, గ్రాడ్యుయేషన్ డే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని వాసవీనగర్‌లోని ఎస్‌వీ మోడల్ హై స్కూల్‌లో కల్చరల్, గ్రాడ్యుయేషన్ డే వేడుకలను వైభ వంగా నిర్వహించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ ఓరుగంటి శ్యామ్‌సుందర్, డైరెక్టర్ విశాలక్ష్మి లు మాట్లాడుతూ యుకేజీ విద్యా ర్థులు తమ ప్రీ ప్రైమరీ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకోని ప్రైమరీ విద్యలోకి అడుగుపెడుతున్నారని అన్నారు. 5వ తరగతి విద్యార్థులు ప్రైమరీ విద్యను పూర్తి చేసుకోని హయ్యర్ ఎడ్యుకేషన్ లోకి ప్రవేశిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకోని గ్రాడ్యుయేషణ్ వేడుకలను ఆనందంగా నిర్వహించుకున్నారని అన్నారు. ఈ సంద ర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని పలువురిని అల రించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆర్వి టీవీఎస్ షోరూం ప్రారంభం

**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణంలోని పటేల్ నగర్‌లో శనివారం ఆర్వి టీవీఎస్ షోరూంను ప్రభుత్వ విప్ వేముల వీరేశం ప్రారంభిం చారు. నకిరేకల్ పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో ఇలాంటి షోరూ మ్‌లు ప్రజలకు అందుబాటులోకి రావడం అభినందనీయమని ఆయన అన్నారు.ఈఅవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,ఆర్విటీవీఎస్ ఎండీ చైతన్య,బ్రాంచ్ ఓనర్ సాయి తేజ,కృష్ణంరాజు,జనరల్ మేనేజర్ శివకుమార్,నెట్ వర్క్ ఇన్‌చార్జ్ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి పాల్గొన్నారు.





## ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మూసీ నది ప్రక్షాళన కోసం కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ చేపట్టిన అవగాహన ర్యాలిలో పాల్గొనేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులను వన్ టౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో కౌన్సిలర్లు పెద్ది శ్రీనివాస్‌గౌడ్, లావూరి సుధాకర్, జన్నపాల కిరణ్, నాయకులు భూక్యా రాంబాబు, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

## చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/చండూరు:** పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరంలా పనిచేస్తుందని చండూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ పేర్కొన్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 9.97లక్షల విలువైన సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం 30 మంది లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిమికొండ జనార్ధన్ పాల్గొన్నారు.

## వుషు కుంగ్ఫు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు ప్రారంభం

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్లో వుషు కుంగ్ఫు కోచ్ ఠాకూర్ నితీష్ సింగ్ అధ్యక్షతన వుషు కుంగ్ఫు మార్షల్ ఆరట్స్ శిక్షణ తరగతులను భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగలపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతమశెట్టి మంజులవెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ ఈరోజుల్లో అమ్మాయిలు మార్షల్ ఆరట్స్ నేర్చుకోవాలి అని అన్నారు. ఈ వుషు మార్షల్ ఆరట్స్ నేర్చుకోవడం వలన ఆరోగ్యం, విద్యా, ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగడి నాగరాజు, ఉమ్మడి నల్గొండ జిల్లా వుషు చైర్మన్ సయ్యద్ యాకుబ్ మాస్టర్, సెక్రటరీ కోటేశ్వర్, జిల్లా అధ్యక్షులు బొగ వెంకటేశం, జిల్లా సెక్రటరీ రాజు, అల్లే నరేష్, మాస్టర్లు లింగం, నవీన్, పురుషోత్తం, చందు, సింధు, నాగేశ్వరి, నరసింహ, మోయిన్, సిద్ధార్థ మిత్ర బృందం పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

**ప్రజాపక్షం/మోతె :** మండలంలోని అన్నారిగూడెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ ఇంద్రాల సుప్రజ శ్రీనివాస్ అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అర్వపల్లి గణేష్, గ్రామ కార్యదర్శి సింధు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.



## పేద విద్యార్థులను విద్యకు దూరం చేసేందుకు కుట్ర

**ప్రజాపక్షం/భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పు సరైనది కాదని ప్రభుత్వ హామీలతో కళాశాలలో విద్యార్థులను చేర్చుకున్నారు ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులు గురిచేయడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఫీజు బకాయిలపై ఇచ్చిన తీర్పులో విద్యార్థుల నుండి ఫీజు బకాయలు వసూళ్లు చేసుకోమని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి విద్యార్థులకు చెల్లించాలని తీర్పు ఇవ్వడం సరైనది కాదని పేద విద్యార్థుల చదువులకు హైకోర్టు తీర్పు గొడ్డలి పెట్టు లాంటిదని తక్షణమే హైకోర్టు తీర్పును పున:సమిక్ష చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రైవేట్ కళాశాలలో ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారన్నారు. పేద వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్రలో భాగంగానే రేవంత్ సర్కార్ పనిచేస్తుందన్నారు. తక్షణమే




హైకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్ష చేసుకోవాలన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఫీజు బకాయిలు విడుదల చేయాలని అసెంబ్లీ ముట్టడి కూడా చేశామని ఆయన గుర్తు చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మారుపాక లోకేష్, జిల్లా నాయకులు రాంపాక చందు, సూరారం కళ్యాణ్, మహేష్ పాల్గొన్నారు.

## క్రీస్తు చూపిన ప్రేమ కరుణ మతానికి పరిమితం కావు



**ప్రజాపక్షం/వేములపల్లి:** ఏసుక్రీస్తు చూపిన ప్రేమ కరుణ ఆయన బోధనలు కేవలం మతానికి పరిమితం కావని యువతకు ఆదర్శం అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.శనివారం తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు పుట్టల ఇమాన్యుల్ దైద సాల్మన్,పుట్టల శ్రీనివాస్,పుట్టల వజ్రమ్మ నాగయ్య కవిత స్వప్న శైలజ శ్రీనివాస్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రపంచానికి శాంతి, ప్రేమ, కరుణ సందేశాన్ని అందించిన మహోన్నతుడు ఏసుక్రీస్తు అని దేవరకొండ మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని సెయింట్ మేరిస్కూల్ నుండి నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ర్యాలీలో కన్వీనర్ ఐడి సల్మాన్ రాజు, కోనేరు ప్రభుప్రసాద్, ఇతర ప్రముఖులు, విశ్వాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కిరణ్ సాయి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపి చామల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రంలోని విద్యుత్ నగర్ కాలనీకి చెందిన పర్వతం కిరణ్ సాయి(12) అనే విద్యార్థిఆదివారం తన స్నేహితులతో కలిసి అర్జాల బావి కాలువ వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ విషాద ఘటనపై స్పందించిన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మృత బాలుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.బాలుడి అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన,బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎంపీ,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కాగామృత బాలుడి తండ్రి పర్వతం వేణు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి



వీరాభిమాని కావడంతో,తన అభిమానాన్ని చాటుకుంటూ తన కుమారుడికి కిరణ్ సాయి అనే పేరు పెట్టుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పూన కైలాష్ నేత,నార్కట్‌పల్లి మాజీ జెడ్పీటీసీ అలుగుబెల్లి రవీందర్ రెడ్డి,టీపీసీసీ అధికార ప్రతినిధి నూక కిరణ్ యాదవ్,13వ వార్డు ఇంచార్జ్ కంచర కుంట్ల వెంకట్ రెడ్డి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజా పక్షం/నకిరేకల్ :**హెచ్‌పివి వ్యాక్సిన్ అవగాహన కార్యక్రమం పోస్టర్ను స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం తన నివాసంలో ఆవిష్కరించారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈవ్యాక్సిన్ మహిళల ఆరోగ్య రక్షణకు,ముఖ్యంగా సర్వికల్ క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





## బిఆర్ఎస్‌వి నేత నాగార్జున ముదిరాజ్ ముందస్తు అరెస్ట్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బిఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.జిల్లా కేంద్రంలోని తిరుమల నగర్‌లో నివాసం ఉంటున్న ఆయన బిఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మూసి నది పోరుబాట కార్యక్రమానికి హైదరాబాద్‌కు వెళ్లనున్న నేపథ్యంలో టూటౌన్ పోలీసులు ముందస్తు చర్యగా అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు.మూసి నది బాధితులకు అండగా నిలవడానికి బిఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.మూసి నది బాధితుల సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## నోములలో త్వరలో ఎన్‌డిసిఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మండలంలోని నోముల గ్రామంలో ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మార్కెట్ సెంటర్ ఇన్‌చార్జి సామ సత్తిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,369,గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,389 చెల్లిస్తామని పేర్కొన్నారు.నాణ్యమైన ధాన్యాన్ని, నిర్ణయించిన తేమ శాతం నిబంధనల మేరకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు పూర్తి మద్దతు ధర లభించడంతో పాటు మధ్యవర్తుల ఇబ్బందులు ఉండవని తెలిపారు.అందుబాటులో ఉన్న ఈఅవకాశాన్ని నోముల పరిసర ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల సెక్రెటరీ జనరల్ సాగర్ల పరమేష్ యాదవ్ తెలిపారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిలో పోటీ పడాలని, దాడులకు ఉసిగొల్పడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంటి శ్రీశైలం, నాయకులు రాజేష్ నాయక్ కనకరాజు, కల్లూరి శ్రీనాథ్, బబ్బురి వెంకటేష్, షాదుల్లా, బాలరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాములు మృతి పార్టీకి తీరనిలోటు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మాజీ సర్పంచ్ చింతల శ్రీరాములు మృతి పార్టీకి తీరని లోటని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దోసపహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ చింతల శ్రీరాములు పార్థీవ దేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూముల భుజంగరావు, తూముల సురేష్ రావు, మేడిమేలపు దామోదర్ రెడిడ కొండేటి బిక్షం రెడ్డి, నారాయణ ప్రవీణ్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, కొనతం రాజేష్ రెడ్డి, సద్దల నాగేశ్వరరావు, విద్యాసాగర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.